www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 ఆగస్టు 2024



వరద నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే



కాజ్‌వేపై రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి- మామిడికుదురు

గోదావరి వరద పెరగడంతో పి.గన్నవరం మండలం చాకలి పాలెం శివారు కరకట్ట దిగువనున్న కనకాయిలంక కాజ్వే శనివారం మళ్లీ వరద నీట మునిగింది. కాజ్‌వేపై మూడు అడుగుల మేర వరదనీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. గత నెలలో సుమారు 15 రోజులపాటు కాజ్‌వే వరద ముంపు లో ఉండగా తాజాగా మళ్లీ వరద పెరుగుతుండడంతో వరద నీట మునిగింది.

దిండి.. సౌకర్యం లేదండి..

- అసౌకర్యాల చెంత దిండి రిసార్ట్స్
- రోజు రోజుకూ కరువౌతున్న ఆదరణ
- ఇదే కొనసాగితే మనుగడ కష్టమే



దిండి రిసార్ట్స్, ఇన్‌సెట్‌లో బురదమయంగా రిసార్ట్స్‌కు వెళ్లే ప్రధాన రహదారి

ప్రజాశక్తి - రాజోలు


ఓ వైపు వశిష్ఠ గోదావరి అందాలు.. అటు ఇటు కొబ్బరి చెట్ల వయ్యారాలు.. ఆ నడుమ దిండి రిసార్ట్స్. రాజోలు నియోజకవర్గానికి రాష్ట్ర గవర్నర్ వచ్చినా.. ముఖ్య మంత్రి వచ్చినా.. కేంద్ర మంత్రి వచ్చినా.. అక్కడే బస! సినీ రాజకీయ ప్రముఖులు వచ్చినా అక్కడ సందడి! అలాంటి పేరున్న అందాల భరిణె నేడు అసౌకర్యాలతో కొట్టు మిట్టాడుతోంది. 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న చందాన మలికిపురం మండలం దిండి ఎపి టూరిజం రిసార్ట్ సక్రమ నిర్వహణకు నోచుకోవడం లేదు. దాని పరిస్థితి ఇప్పుడు అయోమయంలో ఉంది.

ప్రయివేటు రిసార్టుల వైపు పర్యాటకుల మొగ్గు

దిండి ఎపి టూరిజం రిసార్ట్స్ ఒకప్పుడు రిసార్ట్స్ కి రావడానికి పర్యటకులకు క్యూ కట్టే వారు ప్రస్తుతం ప్రయివేటు రిసార్ట్స్‌పై మొగ్గు చూపుతున్నారు .దీనికి ప్రధాన కారణం ఎపి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న దిండి రిసార్ట్స్ నిర్వహణ గాలికి వదిలేశారని పలు విమర్శలు ఉన్నాయి. గతంలో కోనసీమ లో ఎలాంటి సినిమా షూటింగ్‌లు జరిపినాన్నా ప్రముఖ సినీ నటులు దిండి రిసార్ట్స్ లోనే దిగేవారు. ఏ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు వచ్చినా దిండి ఎపి టూరిజంలోనే బస చేసే వారు. కానీ ప్రస్తుతం నిర్వహిస్తున్న నిర్వాహకుల కారణంగా ప్రయివేటు రిసార్ట్స్‌లను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయివేటు రిసార్ట్స్ కు కాసుల వర్షం,ప్రభుత్వ రిసార్ట్స్ కు విమర్శల వర్షం అన్న మాదిరిగా తయారైంది.

తగ్గుతున్న పర్యాటకుల సంఖ్య

పర్యాటక రంగంలో దిండి రిసార్ట్స్ కు ప్రాముఖ్యత ఉంది కాని సౌకర్యాలు కల్పించడంలో నిర్వహకులు అలసత్వం వహించడంతో ఆదరణ కరువౌతోంది. దీనికి తోడు ఎపి టూరిజం రిసార్ట్స్ కు ఆనుకుని ప్రయివేటు రిసార్ట్స్ పుట్టుకురావడంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు వాటిపై ఆకర్షితులై వాటి వెంట పడుతున్నారు.దీనికి ఎపి రిసార్ట్స్ కు సంబంధించిన కొంతమంది ప్రయివేటు రిసార్ట్స్‌కు సిఫార్స్ చేయడంతో ప్రభుత్వ రిసార్ట్స్‌కు వచ్చేందుకు పర్యాటకులు సంఖ్య తగ్గింది. దీనికితోడు రిసార్ట్స్ అపరిశుభ్ర వాతావరణంలో ఉండటం, నిర్వహణ సరిగా లేకపోవం రిసార్ట్స్‌లో రెస్టారెంట్ లేకపోవడం ఒక వేళ ఉన్నా సరైన భోజనం దొరకకపోవడం, రిసార్ట్స్‌కు వచ్చే మార్గం సరిగా లేకపోవడం, స్విమ్మింగ్ పూల్ నిర్వహణ లేకపోవడం, బోటు నిర్వహణ కూడా అధ్వానంగా ఉండటం ఇటువంటి వాటితో రిసార్ట్స్ కు వచ్చేందుకు పర్యటకులు వెనకడుగు వేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో అయినా ఎపి టూరిజంపై దృష్టి పెట్టి దిండి రిసార్ట్స్ కు పూర్వ వైభవం తీసుకుని రావాలని పలువురు కోరుతున్నారు.



నిర్వహణ లోపంతో నిలిచిన బోట్లు (ఫైల్)

నిర్వహణ సరిగా లేదు



దిండి రిసార్ట్స్‌లో వసతులు సరిగా లేవడంతో నిర్వహణ అధ్వానంగా తయారైంది. గతంలో అన్ని వసతులతో నిర్వహిస్తే పూర్వ వైభవం వస్తుంది. కనీస సౌకర్యాలు లేకపోవడం తో పర్యాటకులు ప్రయివేటు రిసార్ట్స్ లను ఆశ్రయిస్తున్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలి.

-సరేళ్ల విజయ ప్రసాద్,మాజీ సర్పంచ్,రామేశ్వరం

ఉచిత ఇసుక పాలసీపై మంత్రి సమీక్ష

రాష్ట్ర ఎక్సైజ్ , గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమలాపురం

నూతన ఇసుక పాలసీ -2024 అమలు తీరుపై జిల్లా స్థాయి అధికారులతో రాష్ట్ర ఎక్సైజ్, గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలుచేయాలని సూచించారు. నేరుగా భవన నిర్మాణ యాజమాన్యాలు సచివాలయాలకు వెళ్లి ఇసుకను బుక్ చేసుకుంటే జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాలకు ఎటువంటి వెయిటింగ్‌కు ఆస్కారం లేకుండా రోజువారీ టోకెన్లు జనరేట్ చేస్తూ అదనపు తవకలకు తావు లేకుండా ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లా యంత్రాంగం కిలోమీటర్ వారీగా రవాణా చార్జీలను కూడా నిర్ణయించిందన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు మూడు మాసాలు ఇసుక తవ్వకాలు నిర్వ హించడం లేదన్నారు. అక్టోబర్ తర్వాత ఇసుక పాలసీపై త్వరలో రాష్ట్రస్థాయిలో సమావేశం నిర్వహించి మరోసారి వ్యవస్థ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై సమీక్షిస్తామన్నారు. కోస్తా రెగ్యులేటరీ జోన్ ప్రతిపాదనల కు అనుగుణంగా కాలుష్య నియంత్రణ మండలి ద్వారా అనుమతులు పొందుతూ గుర్తించిన రీచులలో ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందుతూ అదేవిధంగా బోట్స్ మెన్ సొసైటీల ద్వారా ఇసుక తవ్వకాలు నిర్వహించి స్టాక్ యార్డులు తరలిస్తున్నామన్నారు. అక్టోబర్ 15 నుండి పూర్తిస్థాయిలో జిల్లాలో 24 రీచ్ లలో ఇసుక తవ్వకాలు నిర్వహించి కోనసీమ తూర్పుగోదావరి జిల్లాల నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిమాండ్ సప్లై అనుగుణంగా ఇసుకను సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ నిర్మాణాల వద్ద నిలువ ఉంచిన చేసిన ఇసుక నిల్వలను గుర్తించి అనుమతులు ఆధారంగా తగు చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు. కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ వర్షాకాలం మూడు నెలలు ఇసుక తవ్వకాలు జరగని సమయంలో డిమాండ్ సప్లై [illegible] అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అమలాపురం ఎంఎల్ఎ ఎ.ఆనందరావు, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, జిల్లా ఎస్పి బి.కష్ణారావు, గనుల శాఖ జాయింట్ డైరెక్టర్ రవీంద్ర, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కోనసీమ బాలోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రారంభించామని, పిల్లలకు చిన్ననాటి నుండే సాంస్కృతిక కార్యక్రమాలలోనూ ఆటలలోను మనో వికాసాన్ని కలిగించడానికి కోనసీమ బాలోత్సవం ఉద్దేశమని జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర కుమార్, కోనసీమ బాలోత్సవ అధ్యక్షులు కర్రి కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఇన్చార్జి యండూరి పవన్, మనం ట్రస్ట్ చైర్మన్ కె.వీరబాబు అన్నారు. శనివారం కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో ఈ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్‌డిఒ జివివి.సత్యనారాయణ మాట్లాడారు. స్థానిక సర్పంచ్ బూసి జయలక్ష్మి, అంతర్జాతీయ శిల్పి రాజ్ కుమార్ వడయార్, మందపల్లి మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణ మోహన్, సత్తిరాజు ఉషారాణి, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాశర్లపూడి బాడవలో శానిటేషన్ పనులు



పనుల పర్యవేక్షిస్తున్న హెల్త్ అసిస్టెంట్

ప్రజాశక్తి -మామిడికుదురు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పాశర్లపూడి బాడవలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి నాగరాజు తెలిపారు. ముందస్తు వ్యాధులు వ్యాపించకుండా వరద ముంపు ప్రాంతాలతో పాటు, బహిరంగ ప్రదేశాతెకత, నీరు నిలవ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించామన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు పంచాయితీకార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణ ఇస్తామని మండల అభివృద్ధి అధికారి శ్రీరామచంద్రమూర్తి శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు ఈ నెల 12. సోమవారం నుండి .14 బుధవారం వరకు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని అన్నారు. పారిశుధ్యం, చెత్త నుంచి సంపద, వీధిలైట్లు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని ఆయన వివరించారు. గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని మండల అభివృద్ధి అధికారి విజ్ఞప్తి చేశారు.



విరాళాన్ని అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం


అంగరలో శ్రీ అలివేలుమంగ గోదాదేవి సమేత వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శాశ్వత అన్నదానం నిమిత్తం దాత రూ.25 వేలు విరాళాన్ని దాత శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కూర్మాపురం గ్రామానికి చెందిన దివంగత చోటపల్లి సత్యనారాయణ, చక్రవేణి దంపతుల కుమారుడు వెంకటేశ్వరరావు,చక్రవేణి దంపతులు, వీరి కుమారుడు వీర వెంకట సూర్య మణికంఠలు ఈ విరాళాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. దాత కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు బాల బాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు.

బాలబాలాజీ ఆదాయం రూ.2.73 లక్షలు

ప్రజాశక్తి-మామిడి కుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి దేవస్థానం నందు శనివారం లడ్డు ప్రసాదం విక్రయం, దర్శనము టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.2,03,820 మరియు నిత్యాన్నదాన ట్రస్ట్ నకు రూ.69,367 మొత్తం రూ.2,73,187 ఆదాయం వచ్చిందని ఆలయసహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు స్వామి వారిని 3,582 మంది యాత్రికులు దర్శించుకోగా 2,896మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



అమలాపురంలో మాట్లాడుతున్నయుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో శనివారం ఘనంగా నిర్వ:హించారు. నాయకులు పాల్గొని ప్రసంగించారు.

అమలాపురం: యుటిఎఫ్ 51వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా ఘనంగా స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు యుటిఎఫ్ భవన్ నందు యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగిన విద్యాసదస్సులో యుటిఎఫ్ పూర్వపు అధ్యక్షులు జోజయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా పనిచేసిందన్నారు. ప్రభుత్వం విడుదలచేస్తున్న శ్వేత పత్రాల్లో గత ప్రభుత్వం వైఫల్యాలు తప్ప తమ ప్రభుత్వం ఏమి చేస్తుందన్న అంశం లేదని ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ఆరోపించారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణోత్సవ సంబరాలు పాటల సిడిని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వర రావు ఆవిష్కరించారు. రాష్ట్ర యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు నాయకులకు పిలుపనిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యదర్శులు ఎ.మల్లేశ్వరరావు, ఎస్‌పి.మనోహర్, ఎస్.జ్యోతిబసు, అరుణకుమారి, బి.లక్ష్మీ రాజా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, ఎంటివి.సుబ్బారావు, టి.చక్రవర్తి, కె.నగేష్, పి.జయకర్, షరీఫ్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో యుటిఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉద్యమ నాయకులైన అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి లక్ష్మయ్య, వత్సవాయి సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు పతాకావిష్కరణ చేసి ఈ 50 ఏళ్లలో యుటిఎఫ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యు టిఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షులు ప్రసాద్, అధ్యక్షులు టి.రామకష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర్ బాబు, సహాధ్యక్షురాలు డిడి.లక్ష్మీదేవి, ఉపాధ్యా యులు దుర్గ, వాసుకి, శ్యామ్, కడలి ప్రసాద్, కొండేపూడి ప్రసాద్, కారింకి ప్రసాద్, మోహన్‌రావు, కారింకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ పోరాటం స్ఫూర్తిదాయకమని ఎం ఇఒ లక్ష్మీ నారాయణ అన్నారు. మామిడికుదురులో యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎమ్.వెంకన్నబాబు, మండల యుటిఎఫ్ అధ్యక్షులు నాగప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, కుడిపూడిసత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్యోతిబసు

అంబేద్కర్ విగ్రహ ఫలకం ధ్వంసంపై వైసిపి నిరసన



ద్రాక్షారామంలో నిరసన తెలుపుతున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంపై దాడికి వైసిపి శ్రేణులు శనివారం నిరసన తెలిపాయి.

రామచంద్రపురం: ఎపిలో నిర్మించిన అంబేద్కర్ స్మృతి వనంలో శిలాఫలకం ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలని ద్రాక్షారామంలో దళితులు వైసిపి నాయకులు నిరసన తెలిపారు. శనివారం ద్రాక్షారామంలో యానాం సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్య ప్రకాష్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ టిడిపి నాయకులు కక్షపూరిత పద్ధతిలో పాలన సాగిస్తూ దాడులు చేయడం, శిలాఫలకాలు ధ్వంసం చేయడం వంటి కార్యక్రమాలకు పాల్పడుతోందన్నారు. ఎంపిపి అంబటి భవాని మాట్లాడుతూ దోషులను గుర్తించి శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాధంశెట్టి శ్రీదేవి, మాజీయ జెడ్‌పిటిసి సభ్యులు పెట్ట శ్రీనివాసరావు, ఇంత సంతోషం, దళిత నాయకులు రేవు నాగేశ్వరరావు, గుబ్బల శ్రీనివాసరావు, పంపన సుబ్బారావు, కొప్పిశెట్టి వెంకట రమణ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** విజయవాడలో అంబేద్కర్ విగ్రహంపై దాడి అనైతిక చర్య అని ఇది దళితుల మనోభావాలను దెబ్బతీసిందని అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు గుడ్‌ఫీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తంలో శనివారం రమణారావు విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కేంద్రం స్పందించి ఘటనపై విచారణ జరిపించడమే కాకుండా బాధ్యులను అరెస్టు చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రమణారావు వెంట నాయకులు పినిపే జయరాజు, నేలపూడి సుగంధ కుమార్,నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్,కుంచే అర్జున్,నడింపల్లి సుబ్బరాజుతదితరులు ఉన్నారు. **కొత్తపేట:** విజయవాడ అంబేద్కర్ ప్రాంగణంలో జరిగిన అవమానకర చర్యను ఖండిస్తూ మాజీ ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో నిరసన తెలియచేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి డేవిడ్ రాజ్, మార్గాన గంగాధర్ ముత్యాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి

'జనసేన' క్రియాశీలక సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నియోజకవర్గంలో 11,671 జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నమోదయ్యాయని, ప్రతి మండలానికి 15 మంది చొప్పున క్రియాశీల మెంబర్ షిప్ వాలంటీర్లు ఈ కార్యక్రమాలను నిర్వహించారని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు దూడల స్వామినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మండలంలో 3529 మంది క్రియాశీల సభ్యత్వాలు నమోదు అయ్యాయని అన్నారు.

యువత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ఫ్రెషర్స్ డే వేడుకల్లో మంత్రి సుభాష్



మోడ్రన్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

యువత సరైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆయన పట్టణంలోని మోడరన్ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శనివారం విజయ్ ఫంక్షన్ హాల్ నందు ప్రెషర్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మంత్రి హాజరయ్యారు. యువత స్పష్టమైన లక్ష్యం కలిగి ఉండాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని స్పష్టంచేశారు .విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ కలుగజేసే ఆశయంతో మోడరన్ విద్యా సంస్థలను నిర్వహిస్తున్న జివి.రావు ఆదర్శ ప్రాయుడని అభినందించారు. మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గురువు సాక్షాత్తు పర బ్రహ్మ స్వరూపం అని, అలాగే తల్లిదండ్రులు దైవ సమానులు అని విద్యార్థులకు హితవు పలికారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను రాష్ట్ర స్థాయి ర్యాంకర్లగా తీర్చిదిద్దుతున్న మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జివి.రావు కృషి అభినందనీయమన్నారు. జివి.రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాలతో. విద్య అందజేయ డానికి మోడరన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కమిషనర్ శ్రీనివాసులకు మోడరన్ ఫౌండేషన్ తరపున ప్రజాహిత పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, డిగ్రీ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి, మోడరన్ వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, మోడరన్ కాలేజీ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని లయన్స్ కళ్యాణ మండపంలో రామచంద్రపురం నియోజకవర్గ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, డ్వాక్రా, విఎఒలు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. మంత్రి సుభాస్‌ను సమావేశానికి ఆహ్వానించి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను, జీతాలు బకాయిలు మంత్రికి తెలియజేశారు. వారి సమస్యల పట. మంత్రి అధికారులతో జీతాల బకాయిల గురించి మాట్లాడారు ఈ నెలాఖరులోగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

21న రావులపాలెంలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఆలమూరు

రావులపాలెం సత్యసాయి విద్యాసంస్థలు ప్రాంగణంలో ఈ నెల21 వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని బండారు సత్యానంద రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్యాలయం నందు వివిధ కంపెనీలకు సంబంధించి పోస్టుల వివరాలను తెలుపుతున్న కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సుమారు 28 కంపెనీల నుంచి హెచ్ఆర్ ప్రతినిధులు ఈ జాబ్ మేళాకు హాజరు కానున్నరన్నారు. వారంతా తమ సంస్థలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని ఆయన తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే వారు. నేరుగా విద్యార్హత ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై అర్హతలకు తగ్గట్టుగా మంచి ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకోవాలని ఆయన తెలిపారు. అలాగే వికాస మేనేజర్ జి.రమేష్ మాట్లాడుతూ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారున. అభ్యర్థులకు ఉదయం 9 గంటలనుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. సుమారు 2025 ఖాళీలను భర్తీ చేసేందుకు వీలుగా ఈ మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ధరణాల రామకష్ణ, దండంగి మమత, దండంగి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరును ప్రస్తావించక పోవడంపై ఆగ్రహం

ప్రజాశక్తి ముమ్మిడివరం

కూటమి ప్రభుత్వం సర్క్యులర్లలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరును ప్రస్తావించకుండా అమలాపురం జిల్లాగా పేర్కోవడం జిల్లా వాసులను అవమానించడమేనని పలు దళిత, ప్రజా సంఘాలు మండిపడ్డాయి. స్థానిక బుద్ధపార్కు అవరణలో శనివారం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, దళిత ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. వడ్డీ నాగేశ్వర రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగస్ట్ 15న జిల్లా ప్రధాన కేంద్రంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏ జిల్లాలో ఏ ఏ మంత్రులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారో తెలియజేస్తూ విడుదల చేసిన సర్క్యులర్లలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరు ప్రస్తావించకుండా, లేని పేరు అమలాపురం జిల్లా గా ప్రకటిస్తూ సర్క్యులర్ జారీ చేయడం ఉద్దేశపూర్వకంగా చేసిందేనని దుయ్యబట్టారు. తక్షణమే జరిగిన లోపాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొనిపాటి ఆంజనేయులు, కాశి సింహాద్రి వర్మ, కాశి సిద్ధార్థ కుమార్, యలమంచిలి బాలరాజు, సబ్బతి సత్యనారాయణ, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాహనాల వేలంలో రూ.79 వేల ఆదాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక సెబ్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన వాహనాల వేలం ద్వారా రూ.79,332 ఆదాయం వచ్చిందని ఎస్ఐ. చిట్టిబాబు తెలిపారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన 9 వాహనాలకు వేలం నిర్వహించినట్లు తెలిపారు. 5 వాహనాలను వేలంలో పాడుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.59,400 కాగా వేలంలో రూ.79,332కు పాడుకున్నారన్నారు. దీనిలో 33 శాతం ఎక్కువ ఆదాయం వచ్చిందని ఎస్.ఐ. తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని కొత్త కండ్రాడ గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విరవ గ్రామానికి చెందిన కె.సత్తిబాబు(52) తన భార్యతో కలిసి ఉప్పాడ వెళుతుండగా కొత్త కండ్రాడ వద్ద సామర్లకోట నుంచి గొల్లప్రోలు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్తిబాబు అక్కడికక్కడే మరణించగా భార్య సత్యవేణి, మనవడు హేమంత్ గాయాల పాలయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తిబాబు మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐ.పోలవరం మండలం ఎదుర్లంక గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పితాని రామకృష్ణ(42) గత బుధవారం అమలాపురం వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టరును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణ తీవ్రంగా గాయపడగా, అతడిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - [illegible]

వ్యాపారంలో వచ్చిన నష్టంతో చేసిన అప్పుల భారం అధికం కావడంతో ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కల గ్రామానికి చెందిన వీరబాబు వెంకటేశ్వరరావు కోళ్ల ఫారం వ్యాపారం చేస్తూ ఉండేవాడు.ఈ మధ్య కాలంలో వ్యాపారంలో రూ.2.50 లక్షల నష్టం వచ్చింది. దీంతో అప్పులోల్ల నుంచి ఒత్తిడి అధికం అయింది. దీంతో వారి ఒత్తిడిని తట్టుకోలేకపోయిన వెంకటేశ్వర రావు ఈనెల 5వతేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు.



రక్షణ గోడ లేక ఏర్పాటుచేసిన కర్రలు

తాతపూడి పంపింగ్ స్కీమ్‌కు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

తాతపూడి సమీపంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న పంపింగ్ స్కీమ్ భవనానికి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు .గతంలో ఈ గోడ తుఫాను ఉధృతికి నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో రక్షణ గోడ కరువైంది. నీటి ఎద్దడి సమయాల్లోనే ఈ పంపింగ్ స్కీం నుండి గోదావరి నది నుంచి సాగునీరుకు వినియోగిస్తారు. అధికారులు మిగిలిన రోజుల్లో ఈ భవనం వైపు కూడా చూడరు. రక్షణ గోడ లేని ప్రాంతంలో కర్రలతో ఏర్పాటు చేశారు. గతంలో ఈ పంపింగ్ స్కీమ్‌లో ఉన్న సామగ్రి చోరీ జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. భవనంలో విలువైన మోటార్లు, సామగ్రి, ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు, స్థానికులు, సంబంధిత అధికారులను కోరుతున్నారు.


మంత్రి రవీంద్రకు మొక్క అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు

మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కొత్తపేట

డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇసుక, సహజ వనరుల లభ్యత పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరపడానికి జిల్లాకు విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర కు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద శనివారం ఘన స్వాగతం పలికారు. తొలిసారిగా జిల్లాకు వచ్చిన మంత్రి రవీంద్రకు బండారు పుష్ప గుచ్చం అందించి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో కెవి.సత్యనారాయణరెడ్డి, గుత్తుల పట్టాభి, చిలువురి సతీష్ రాజు, ధరణాల రామకష్ణ, జక్కంపూడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాలకుల తీరుపై కార్మికులు మరోసారి కదంతొక్కి తమ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహిం చిన ఆందోళనలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమన నిరసనను వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు ప్రోత్సాహకాల పేరుతో పెద్ద ఎత్తున రాయితీలు కల్పించిన విషయం విధితమే. అధిక సంఖ్యలో ప్రజలు ఉపాధి పొందుతున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అటకె క్కించింది. కనీస మద్దతు ధర లేకపోవటంతో రైతాంగం పూర్తిగా దెబ్బ తింది. అదే విధంగా ప్రభుత్వ రంగ పరి శ్రమలను ప్రయివేటు సంస్థలకు కారు చౌకగా కట్టబెట్టడంతో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువవుతోంది. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. అదేవిధంగా రాష్ట్రంలో పాలకులు స్కీం వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న తీరును నిరసనగా సిఐటియు ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో వేలాది మంది స్కీం వర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. ఇప్పటికైనా పాలకులు పునరాలోచిం చుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

రైతు సమస్యలపై కొరవడిన చిత్తశుద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధి కొరవడిందనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషించే జలవనరులను నిల్వచేసుకునేం దుకు అవకాశాలు ఉన్నా ఆ దిశగా దృష్టి సారించటం లేదు. నిధులు లేక అనేక ప్రాజెక్టులు నీరసించి పోతున్నాయి. పోల వరం నిధుల కేటాయింపులపై కేంద్రం మొండి చేయి చూపిస్తున్న విషయం విధి తమే. మరోవైపు కాటన్ బ్యారేజీ ఎగువన డ్రెడ్జింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ లోపించింది. తాజా

వరదలు రైతులకు నిరాశను మిగిల్చాయి. మరో వైపు ప్రతి ఏటా పెరుగుతున్న ఎరువులు, పురుగుల మందుల ధరలకు కళ్లెం వేయటం లేదు. దీంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. సాగు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడులకు నగదు అందజేసి చిత్తశుద్ధి నిలుపుకోవాల్సి ఉంది. సిసిఆర్‌సి కార్డుల మంజూరులో నిబంధనలు సడలించి అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు, రైతు సంఘాలు డిమాం డ్ చేస్తున్నాయి. గోదావరి వరదల కారణం గా అనేక పంటలు నేలమట్టం అయ్యాయి. కాల్వల ఆధునీకరణ, పూడికతీతలు లేకపోవటమే ఈ దుస్థితి కారణమని గత అనుభవాలు చెబుతున్నాయి. నూతన ప్రభుత్వమైనా ఆధునీకరణ పనులు దిశగా అడుగులు వేయాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వలంటీర్లు, ఎండియు ఆపరేటర్లపై నీలినీడలు

నూతన ప్రభుత్వ విధానాల ఫలితంగా వలంటీర్లు, ఎండియూ ఆపరేటర్లు, హెల్పర్ల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. గత పాలనలో స్కీం వర్కర్లతో పాటు వలంటీర్లు, ఎండియూ ఆపరేటర్లు కీలకంగా వ్యవహరించిన విషయం విధితమే. రేషన్ సరఫరాలో ఎండియూ ఆపరేటర్లు, ధృవీకరణ పత్రాలకు దరఖాస్తులు తీసుకోవటంలో వలంటీర్లు కొంత మేర సేవలందించారు. అయితే వీరంతా వైసిపికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు నెలకొన్న విషయం విధితమే. తాజాగా నూతన ప్రభుత్వం పింఛన్ల పంపిణీ ప్రక్రియకు వలంటీర్లను దూరంగా ఉంచింది. రేషన్ సరఫరాకు ఎండియూ ఆపరేటర్ల దూరం కానున్నారని తెలుస్తోంది. తాజాగా తొలగింపుల నేపథ్యంలో ఉపాధికి గండి పడనుంది. ఆయా రంగాలలో పనిచేసే వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.


నిరసనలో మాట్లాడుతున్న నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ నరసింహం

జగ్గంపేటలో వైసిపి కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - జగ్గంపేట

విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకాన్ని ధ్వంసానికి నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్ నుంచి వైఎస్ఆర్ విగ్రహం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం మాట్లాడుతూ ఆ సంఘటనలో పాల్గొన్న దుండగులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట రాంజీ, రామకుర్తి జగ్గలు, కాపవరపు ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కంచాల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన్నబ్రహ్మదేవం గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన కంచాలు, గ్లాసులు, చాపలు, ఫ్యాన్లు అందచేశారు. టిడిపి నాయకులు కంచుమర్తి కాటమరాజు, జనసేన నాయకులు చవ్వాకుల బాలరాజు ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన వాటిని వారి చేతుల మీదుగా శనివారం అందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాయి శ్యామల, ఆయా బత్రెడ్డి అమ్మాజీ పాల్గొన్నారు.


కంచాలు, గ్లాసులు అందచేస్తున్న నాయకులు

ప్రజాశక్తి సర్క్యులేషన్ పెంపుదల క్యాంపెయిన్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మెయిన్‌రోడ్‌లో శనివారం సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాశక్తి సర్క్యులేషన్ క్యాంపెయిన్‌కు విశేష స్పందన లభించింది. శనివారం ఒకరోజు 40 పత్రికలు పెంపుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, దారపురెడ్డి కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, సిరపరపు మరిడియ్య, దాడి బేబీ, మాగాపు నాగు, సిరపరపు శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి సత్యనారాయణ, నెక్కల సూరిబాబు, చల్లా విశ్వనాథం, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాంపెయిన్‌లో సిపిఎం నాయకులు

మరిడమ్మను దర్శించుకున్న చాగంటి

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మను శనివారం ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహన్ రావు ఆధ్వర్యంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రియాశీలక సభ్యత్వంలో ప్రసాద్ టాప్

ప్రజాశక్తి - తాళ్లరేవు

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంలో పి.మల్లవరంకు చెందిన వేగి రుద్రనాగ భైరవప్రసాద్ అగ్రస్థానంలో నిలిచినట్లు జనసేన మండల పార్టీ అధ్యక్షులు అత్తిలి బాబూరావు తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు అత్యధికంగా 517 చేయించినట్లు తెలిపారు. మండలానికి చెందిన ఎమ్. హరిసత్య మణికంఠ, పుణ్యమంతుల సత్తిబాబులు 400 పైన సభ్యత్వాలు చేశారన్నారు. మరో 8 మంది 100 క్రియాశీలక సభ్యత్వాలు చేశారని తెలిపారు.

ఇద్దరు బాలికల మిస్సింగ్

- పత్యేక బృందాలతో విచారణకు ఆదేశం
- సౌత్‌జోన్ డిఎస్‌పి అంబికాప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఇద్దరు బాలికల మిస్సింగ్‌కు సంబంధించి తెలిసిన వ్యక్తి ద్వారానే జరిగిందని సౌత్ జోన్ డిఎస్‌పి వి.అంబికాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం బరంపురంకి చెందిన ఒక ఆమె తన భర్తతో విడిపోయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి గత 8 సంవత్సరాలుగా ధవళేశ్వరం గ్రామంలో నివాసం ఉంటుందన్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నదని తెలిపారు. ఆమె కుమార్తెలు కాకినాడలో వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారని వివరించారు. మే నెలలో సెలవుల కారణంగా ధవళేశ్వరం గ్రామంలో తల్లి ఇంటి వద్దకు వచ్చి ఉంటున్నారని, మూడు నెలల క్రితం మారోజు వెంకటేష్ అనే వ్యక్తి రైల్వేలో టిసిగా పనిచేస్తున్నట్లు చెప్పి వీరు ఉంటున్న ఇంటి పై పోర్షనులో అద్దెకు దిగాడు. అతనితో పాటు ఒక 17 సంవత్సరాల అమ్మాయి ఉంది. ఆమెను తన చెల్లి అని చెప్పాడు. ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా ఉంటూ, ఆ ఇద్దరు పిల్లలను మచ్చిక చేసుకుని, వారి కుటుంబంతో సన్నిహితంగా ఉన్నాడు. పిల్లల తల్లిని అక్క అని పిలిచేవాడు. ఆమెను, ఆమె పిల్లలను, అలాగే పక్క పోర్షన్‌లో నివాసం ఉండే మరొక ఇద్దరు పిల్లలను తీసుకుని, జూన్ నెలలో అరకు వెళ్లి మూడు రోజులు ఉండి వచ్చారు. అలాగే తిరుపతి వెళ్లి మూడు రోజులు ఉండి, విజయవాడ గుడికి వెళ్లి వచ్చారు. నగరంలో షాపింగ్ మాల్‌లకు, గోదావరి ఘాట్‌లకు, హోటల్స్‌కు వారిని తీసుకుని వెళ్ళాడు. ఆ విధంగా వారి కుటుంబం తో బాగా సన్నిహితంగా మెలిగాడు. తల్లికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తాను అని చెప్పి ఆమెను విజయవాడ తీసుకుని వెళ్ళి గత నెల 29వ తేదీకి ముందు రెండు వారాలు ఆమెను విజయవాడలోనే ఉంచాడు. కుమారుడిని ఆమె దగ్గరకు చేర్చాడు. ఆమె కుమార్తెలు ఇద్దరినీ హాస్టల్‌లో దించుతాను అని చెప్పి జూలై నెల 21 వ తేదిన ధవళేశ్వరం గ్రామానికి వచ్చాడు. ఇద్దరు పిల్లలను తల్లితో ఫోన్లో మాట్లాడించి హాస్టల్ కి వెళ్తున్నామని చెప్పి 22 వ తేదీన ఇద్దరు పిల్లలను తీసుకునివెళ్ళాడు. ఆ తర్వాత కూడా తాను ఒక్కడే విజయవాడ వెళ్లి ఆమెను కలిసి వచ్చాడు. 28వ తేదీ నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రాగా, తల్లికి అనుమానం వచ్చి, గత నెల 29వ తేదీన ధవళేశ్వరం తిరిగి వచ్చి, హాస్టల్ వారితో మాట్లాడింది. తన పిల్లలు హాస్టల్‌కు చేరుకోలేదని తెలుసుకున్న ఆమె ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసును ఛేధించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు, రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు పంపించినట్లు వివరించారు. రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పరిసర ప్రాంతాల్లో మరో మూడు బృందాలతో విచారణ జరుగుతుందని తెలిపారు. 22వ తేదీ తర్వాత రాజమహేంద్రవరంలో ఒక హోటల్లో ఒకరోజు, ఆ తర్వాత నెల్లూరులో ఒక హోటల్లో ఒకరోజు ఆ పిల్లలతో మారోజు వెంకటేష్ ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. 28వ తేదీ ఉదయం తనతో ఉన్న బాలికను రాజమహేంద్రవరం బస్టాండ్‌లో విశాఖపట్నం వెళ్లే బస్సు ఎక్కించి ఆమెను విజయనగరంలోని తన ఇంటికి వెళ్లి పొమ్మని పంపించేశాడు. 28వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి గుంటూరు ప్రాంతంలో అతని ఫోను స్విచ్ ఆఫ్ చేయబడిందని డిఎస్‌పి తెలిపారు.


క్వారీ మార్కెట్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

శిలాఫలకం ధ్వంసానికి నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకంపై దాడికి నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ జరిగింది. శనివారం రాజమహేంద్రవరంలోని క్వారీ జంక్షన్లో వైసిపి శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతివనంలో శిలాఫలకం ధ్వంసాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు. ఈ సంఘటనపై సిఎం, డిప్యూటీ సీఎంలు స్పందిం చకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. హామీలపై ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసిపి నాయకులపై దాడులకు పాల్పడుతుందని అన్నారు. టిడిపి మూకల దాడులలో అనేకమంది వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి మూకల దాడులను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నక్కా శ్రీనగేష్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, తిరగతి దుర్గా, కాటం రజనీకాంత్, మార్తి లక్ష్మి, సాలా సావిత్రి, దాసి వెంకట్రావు, కానుబోయిన సాగర్, మజ్జి అప్పారావు, బిల్డర్ చిన్న, గణేష్, సాంబ, పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ డిఎస్‌పిని కలిసిన గన్ని



డిఎస్‌పిని కలిసిన టిడిపి నేత గన్ని కృష్ణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సెంట్రల్ జోన్ డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన కె.రమేష్‌బాబును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సెంట్రల్ జోన్ పరిధిలో శాంతి భద్రతలు, ట్రాఫిక్, నేరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'మర్రి' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కడియం

వికలాంగ ఉద్యోగులకు అండగా నిలుస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న వికలాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి కాశీ విశ్వనాధ్ సేవలు అభినందనీయమని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకుడు ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రతినిధి పి.అశ్వత్తప్ప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండి జానీబాషా, ఎం.కాశీవిశ్వనాధ్, టి.రామాంజనేయులు, ప్రేమ్ సుధాకర్, బి.రోజా ప్రకాష్, ఎస్.కె.సుభాని, ఎన్.రాజేష్ బాబు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణం లోని టిడిపికార్యాలయం వద్ద రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గం లో వైద్యంచేయించుకోలేని నిరుపేద చిన్నారులకు సంబంధించి గుండె జబ్బులు, డయాబెటిస్ ఆర్థోపెడిక్ ఇంకా ఆనేక అనారోగ్య సమస్యలకుమెడికల్ క్యాంపు లో పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఆపరేషన్లకు ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న పిల్లలకు గుండెల్లో రంధ్రాలు ఉండటం వల్ల పలువురు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని వారందరికీ ఉపయోగపడే విధంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి పలువురు వైద్యులు ఉద్యోగులు, హాజరయ్యారు. చిన్నారులకు అవసరమైన మెడిసిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, టిడిపి,అభిమానులు పాల్గొన్నారు.


చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బాబ్జి

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పళ్ల సూర్యప్రకాశరావు (బాబ్జి)ఎన్నికయ్యారు. సీనియర్ పాత్రికేయులు సిఎస్.మూర్తి ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా జిత్తుక రాంప్రసాద్, కోశాధికారిగా ఇసుకపూడి ప్రఫుల్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా మద్దింశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కోన సత్తిబాబు, జల్లి విక్టర్ కుమార్ గుత్తుల ఏడుకొండలు, సహాయ కార్యదర్శిగా దంగేటి సోమేష్, సహాయ కోశాధికారిగా వేపకాయల రాజు, సభ్యులు మట్టపర్తి శ్రీనివాస్, మాలే వెంకట దుర్గాప్రసాద్, మహిపాల నాగరాజు, గోసంగి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.